కొంగుబంగారం.. కోడూరు గంగమ్మ

రేపటి నుంచి కోడూరు గంగమ్మ జాతర
- జాతరకు 100 సంవత్సరాల చరిత్ర
- భక్తుల రద్దీ దృష్ట్యా భారీ ఏర్పాట్లు
- కట్టుదిట్టమైన భద్రత కల్పించనున్న పోలీసులు, అధికారులు


అలంకరణలో కోడూరు గంగమ్మ(ఫైల్)


దున్నపోతును ఊరేగిస్తున్న భక్తులు



రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు గంగమ్మ భక్తులపాలిట కొంగుబంగారంగా వంద సంవత్సరాలుగా విరాజిల్లుతోంది. పట్టణంలోని పాతబజారు వీధిలో గంగమ్మమిట్ట వద్ద వెలసిన గంగమ్మకు ప్రతి ఏడాది అంగరంగ వైభవంగా జాతర నిర్వహిస్తారు. 100 సంవత్సరాలకు పైబడా చరిత్ర కలిగిన ఇక్కడి జాతరకు చుట్టుపక్కల జిల్లాల నుంచి ప్రజలు వేలాదిగా తరలి వస్తుంటారు. 1925 సంవత్సరం నుంచి కోడూరు గంగమ్మకు నిర్వాహకులు, జాతర కమిటీ వారు ప్రతి ఏడాది వైభవంగా జాతర నిర్వహిస్తున్నారు.

మూడు రోజుల పాటు జాతర మహోత్సవం

30, 1, 2 తేదీలలో గంగమ్మ జాతర జరగనుంది. జాతర సందర్భంగా పట్టణమంతా ప్రత్యేక అంగళ్లు, రంగులరాట్నాలు, జనాలతో కిటకిటలాడుతూ ఉంటుంది. పాత బజారులో అంతా చలువ పందిళ్లతో అలంకరించారు. పట్టణంలోని అన్ని వీధులలో విద్యుత్ బొమ్మలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బుధవారం సాయంత్రం నుంచి స్థానిక అంకాలమ్మ గుడిలో కుమ్మర వాళ్ల భక్తి శ్రద్ధలతో గంగమ్మ తల్లిని తయారుచేసి, బుర్రకథ, ప్రత్యేక పూజలతో రాత్రంతా గంగమ్మకు మొక్కులు తీర్చుకొని గురువారం తెల్లవారుజామున అంకాలమ్మగుడి నుంచి వేలాది మంది భక్తుల కరతాల ధ్వనులతో పల్లకీలో ఊరేగింపుగా అట్టహాసంగా గంగమ్మమిట్టకు చేరుస్తారు. ఈ వేడుక చూడడానికి ఇసుక వేస్తే రాలనంతగా జనం హాజరై గంగమ్మ నడిచే దారిలో మొక్కులు తీర్చుకొంటారు. ఈ అంకంతో జాతర ప్రారంభమవుతుంది. ఉదయం నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఈ ఏడాది భక్తులు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉండడంతో పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

జాతరలో ఘటంకుండకు ప్రత్యేక స్థానం

కోడూరు జాతరలో ఘటంకుండకు ప్రత్యేకస్థానం ఉంది. జాతర చాటింపు జరిగిన నాటి నుంచి ఘటంకుండతో భక్తులు దున్నపోతును అలంకరించి కోడూరు పొలిమేర లోపల ఉన్న ప్రతి వీధికి, ప్రతి ఇంటికి తిరుగుతారు. భక్తులు ఇంటి వద్దకు వచ్చిన ఘటంకుండ, దున్నపోతుకు ప్రత్యేక పూజలు చేస్తారు. జాతర ఘట్టం ప్రారంభం అయ్యేలోగా అన్ని వీధులు తిరిగి వచ్చేస్తారు. స్థానికులు ఘటంకుండకు ఎంతో ప్రాధాన్యత ఇస్తారు.

ఈ ఏడాది జాతర ప్రత్యేకం

కోడూరు జాతరకు 100 సంవత్సరాలు అవ్వడంతో గంగమ్మకు ప్రతేకంగా ఈ ఏడాది భక్తుల సహకారంతో అమ్మవారికి ప్రత్యేకంగా బంగారు కిరీటం, అభయ హస్తాలు, పచ్చరాళ్లు, కెంపులు పొదిగిన నగలతో అలంకరించనున్నారు. అలాగే ప్రత్యేక ఆకర్షణగా పూల అలంకరణ, పల్లకీ ఉండనున్నాయి. అలాగే ప్రత్యేకంగా ఇతర ప్రాంతాల నుంచి డప్పులు, వాయిద్యాలు రానున్నాయి. టోల్‌గేట్ వద్ద డీజే, లైటింగ్ ఇలా అనేక ప్రత్యేకతలు జాతర సందర్భంగా చోటు చేసుకోనున్నాయి. బంధువులు సైతం రానుండటంతో సందడి వాతావరణం నెలకొననుంది.

పెద్దకాల్వపల్లెకు అందుతున్న తాగునీరు


గ్రామంలో ఉన్న బోరు బావికి మోటారు ఏర్పాటు చేసిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

రాయచోటి : పెద్దకాల్వపల్లెలో దాహం కేకలు వార్తపై అధికారులు స్పందించారు. గ్రామ అవసరాలకు తవ్విన బోరునకు మోటారు ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీటి సౌకర్యాన్ని కల్పించారు. రాయచోటి రూరల్ మండలం ఎండపల్లి పంచాయతీ పెద్దకాల్వపల్లెలో తాగునీరు లేక చందా డబ్బులతో ట్యాంకర్లతో నీళ్లు తెచ్చుకుంటున్నారన్న 'సాక్షి'(సోమవారం) కథనంపై అధికారులు స్పందించారు. ఇప్పటికే గ్రామ అవసరాలకు తవ్వించి పెట్టిన బోరు బావికి మోటార్ ఏర్పాటు చేసి ప్రజలకు మంగళవారం నుంచి తాగునీటిని అందించారు. అధికారులు బోరు మోటారు ఏర్పాటు చేయడంతో గ్రామ ప్రజలు 'సాక్షి'కి అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

మే 10 నుంచి జయంత్యుత్సవాలు


గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న భక్తులు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని రెడ్డివారిపల్లి శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో మే 10 నుంచి మూడు రోజుల పాటు నారసింహుని జయంత్యుత్సవాలు నిర్వహించనున్నట్లు వ్యవస్థాపక ఆలయ చైర్మన్ పంద్రా నరసింహులు తెలిపారు. మంగళవారం స్థానిక దేవస్థానంలో ఉత్సవాల గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తేదీన ధ్వజారోహణం, మహాహోమం, 11న స్వాములవారి కల్యాణం, 12న రథోత్సవ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఉత్సవాల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా కొత్తపురమ్మ విగ్రహ పున:ప్రతిష్ట


హోమాలు నిర్వహిస్తున్న వేదపండితులు

సంబేపల్లె : ఆదిపరాశక్తి స్వరూపిణి, దుద్యాల గ్రామ ఆరాధ్య దేవత శ్రీ కొత్తపురి ఎల్లమ్మ (కొత్తపురమ్మ) నూతనంగా నిర్మించారు. ఈ సందర్భంగా విగ్రహ ప్రతిష్ట పూజలు రెండు రోజులుగా వైభవంగా జరుపుతున్నారు. మంగళవారం ప్రాత:కాల పూజలు, అభిషేకాలు, చండీ సప్తశతి పారాయణం, దేవిభాగవతా పారాయణం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, దీక్షా హోమాలు తదితర పూజా క్రతువులను వేదపండితుల ద్వారా జరిపించారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం అమ్మవారి విగ్రహప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పరామర్శ


వెంకటరమణను పరామర్శిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

గాలివీడు : వైఎస్సార్ సీపీ గాలివీడు మండల బిసి సెల్ కన్వీనర్ వల్లపు నగేష్ కుమారుడు వెంకట రమణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కడపలోని జగదీష్ న్యూరో కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సమాచారం తెలుసుకున్న వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి మంగళవారం వెంకటరమణను కడపలోని ఆసుపత్రిలో కలసి పరామర్శించి వైద్యులను అడిగి ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు.

సర్పంచ్‌ను పరామర్శించిన కొరముట్ల


నారాయణ రెడ్డిని పరామర్శిస్తున్న కొరముట్ల

ఓబులవారిపల్లె : అనారోగ్యంతో బాధపడుతున్న ఎల్లాయపల్లి సర్పంచ్ జరుగు నారాయణరెడ్డిని మంగళవారం ఆయన స్వగృహంలో మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పరామర్శించారు. నారాయణ రెడ్డి ఇటీవలే అనారోగ్యంతో శస్త్ర చికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్నారు. మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆయన్ను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాయలసీమ జోనల్ బూత్ కమిటీ సభ్యులు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన నాయకులు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి ఆకుపూజ

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని మద్దిరేవులగ్రామం ఈడిగపల్లి వద్ద వెలసిన శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం పూజారులు స్వామి వారికి ఆకుపూజ, అర్చనలు జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని మంచి వర్షాలు కురిపించి ప్రజలు, రైతులు బాగుండాలని పూజలు నిర్వహించారు. భక్తులకు దర్శనం అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


చెక్కును అందజేస్తున్న సాయిలోకేష్

నందలూరు : ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిలోకేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ మండల కేంద్రవాసి పూల నరేష్ కుమార్ మెదడుకు సంబంధించి వ్యాధితో బాధపడుతుండటంతో ఏలూరు సీఎంసీ హాస్పిటల్‌లో వైద్యం చేయించుకున్నారన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండటంతో సీఎంఆర్ఎఫ్ నుంచి రూ. 4,61,770లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం


రాయచోటి అర్బన్: రిలే నిరాహారదీక్షలు చేపట్టిన ఆర్టీసీ కార్మికులు


రాజంపేట: ఆర్టీసీ పెట్రోలు బంక్ ఎదుట నిరాహార దీక్షలో ఆర్టీసీ కార్మికులు

2వ రోజుకు చేరిన ఆర్టీసీ కార్మికుల రిలే నిరహార దీక్షలు

రాయచోటి అర్బన్/రాజంపేట : సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు ఎస్ఎంయూ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరహార దీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. రాజంపేట, రాయచోటి పట్టణంలోని డిపోల వద్ద కార్మికులు నిరసన తెలిపి, దీక్షలో బైఠాయించారు. రాయచోటిలోని దీక్ష శిబిరానికి ఎస్ఎంయు రీజనల్ అధ్యక్షుడు యం.ఎన్.రావు, జిల్లా కార్యదర్శి పి.యస్.ఎం.రాజులు హాజరై దీక్షలో కూర్చున్నారు. వారు మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో యాజమాన్యం తీవ్రస్థాయిలో నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తుండడం దారుణమన్నారు. 1/2019 సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలని, గత నాలుగేళ్లుగా నిలిపివేసిన ప్రమోషన్లను వెంటనే ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. ప్రభుత్వ మహిళా ఉద్యోగినుల తరహాలోనే ఆర్టీసీ మహిళా కండక్టర్లు, ఉద్యోగినులకు చైల్డ్‌కేర్ లీవులు ఇవ్వాలంటూ కోరారు. ఈహెచ్ఎస్ స్థానంలో పాత మెడికల్ విధానాన్ని కొనసాగించాలంటూ డిమాండ్ చేశారు. రాజంపేట డిపో కార్యదర్శి రమణ మాట్లాడుతూ అక్రమ సస్పెన్షన్ ఆపాలన్నారు. గ్యారేజి సమస్యలు పరిష్కరించాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబాలకు సూపర్‌లగ్జరీ బస్సులో అనుమతించాలని పేర్కొన్నా. రాజంపేటలో నిరాహారదీక్షకు ఏపీ జెఏసీ రాజంపేట చైర్మన్ శెట్టం వెంకటరమణ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో రెడ్డెప్ప, సుధాకర్, హరినాథ, యం.హెచ్.నాయుడు, ఎస్ఎంయు నేతలు పి.వి.రమణ, యం.ఎన్ .ప్రసాద్, రామాంజులు, ఆర్.వి.గోపాల్, డిఎస్ వాసులతోపాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలుంటే వైద్యులను సంప్రదించాలి


ఎస్.రాజంపేట గ్రామంలో రక్త నమూనాలను సేకరిస్తున్న వైద్య సిబ్బంది

సిద్దవటం : మండలంలోని ఎస్.రాజంపేటలో గత కొన్ని రోజులుగా జ్వరాలు ఒళ్లు నొప్పుల బారీన పడి ప్రజలు ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి వైద్య చేయించుకున్నారని తెలుసుకొని పి.కొత్తపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఎస్.రాజంపేటలో మంగళవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రజల నుంచి రక్త పూతల నమూనాలను సేకరించారు. గ్రామంలో ఎవరికైనా ఆరోగ్య సమస్యలు ఉంటే సిద్దవటం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్లు సుబ్బరాయుడు సూచించారు. కార్యక్రమంలో పి.కొత్తపల్లె పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశ వర్కర్‌లు తదితరులు పాల్గొన్నారు.

చలువ పందిళ్లతో ఉపశమనం


మార్కెట్ వీధిలో ఏర్పాటు చేసిన చలువపందిరి

రాయచోటి : అన్నమయ్య జిల్లాలో రోజురోజుకు ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 9 గంటలు అయిందంటే చాలు రాయచోటి పట్టణంలో జనం బయట తిరగలేని పరిస్థితి. జనం రాకపోవడంతో వినియోగదారులను నమ్ముకుని వ్యాపారం సాగిస్తున్న వారికి మండుతున్న ఎండలు శాపంగా మారాయి. చేసేది లేక బజారులోని వ్యాపారులు ఒకటై ప్రజలకు ఇబ్బంది లేకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేయడంతో వినియోగదారులకు ఉపశమనం కల్గిస్తున్నారు. రాయచోటి పట్టణంలోని గాంధీ బజారు, మార్కెట్ వీధులలో కొంతమంది వ్యాపారులు కలిసి నెట్‌తో చలువ పందిళ్లు వేసుకున్నారు. ఈ పందిళ్లు కారణంగా వచ్చి వెళ్లే వినియోగదారులకే కాకుండా స్థానిక వ్యాపారులకు కూడా భగభగ మండే వేడు గాలుల నుంచి ఉపశమనం లభించినట్లు అవుతోంది.

చలివేంద్రం ఏర్పాటు శుభపరిణామం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ జల్లా పద్మావతమ్మ

గాలివీడు : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం శుభపరిణామం అని రాష్ట్ర మాజీ డీపీఓ జిల్లా సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం నూలివీడు బస్టాండ్‌లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీపీ జల్లా పద్మావతమ్మ, సర్పంచ్ ఉమాపతి రెడ్డితో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో చలివేంద్రాలను ఏర్పాటు చేసి తాగునీరు అందించడం అదే విధంగా ప్రజలు ఎండలకు ఎక్కువ తిరగకుండా గ్లూకోజ్, టెంకాయ నీళ్లు వంటివి తీసుకోవడం మంచిదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు అమానుల్లా, భానుమూర్తి రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, మైనార్టీ నాయకులు ఎస్.ఆర్.బాషా, సర్పంచ్ కృష్ణారెడ్డి, యోగాంజులు రెడ్డి, బండి ప్రభాకర్ రెడ్డి, పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

రైల్వేకోడూరు అర్బన్ : అవగాహన లేకుండా బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని జైలు శిక్ష తప్పదని మంగళవారం సీడీపీఓ సౌభాగ్యమ్మ తెలిపారు. స్థానిక మండల సభా భవనంలో బాల్య వివాహాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నిషేధిత చట్టం 2006 ప్రకారం 18 ఏళ్లలోపు బాలికలకు, 21 ఏళ్ల లోపు అబ్బాయిలకు వివాహం చేయడం నేరమన్నారు. పిల్లలకు చదివే వయసులో వివాహాలు చేయకూడదని సూచించారు. గ్రామాలలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నాగార్జున, అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

- అధికారుల అలసత్వంపై ప్రజాప్రతినిధుల అసహనం
- సంక్షేమ పథకాలపై సమాచారం ఇవ్వడం లేదు మండిపాటు


సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

గాలివీడు : అధికారుల అలసత్వంపై మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు సహకరించడంలేదంటూ అధికారుల తీరుపై మండిపడ్డారు. సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయం సభా భావనంలో ఎంపీపీ జల్లా పద్మావతమ్మ అధ్యక్షతన ఎంపీడీఓ ఆధ్వర్యంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా ముగిసింది. ముందుగా జమ్మూ కశ్మీర్ పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిలో మరణించిన పర్యాటకులకు సంతాపం ప్రకటిస్తూ ఐదు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం శాఖల వారీగా అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ప్రజా సమస్యలపై పలువురు ప్రజాప్రతినిధులు ప్రశ్నలను సంధించారు. ముందుగా ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామీణ ఉపాధి హామీ, హౌసింగ్, ఐసీడీఎస్, వెలుగు, పశువైద్యం, విద్య, వైద్యం, విద్యుత్, రెవెన్యూ తదితర శాఖల పనితీరుపై సుదీర్ఘ చర్చ జరిగింది. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషన్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో ఎన్నడూ లేని విధంగా 40 నుంచి 50 మంది పోలీసులు, ఒక సీఐ, ఐదుగురు ఎస్ఐల పోలీసు పహారా మధ్య సర్వసభ్య సమావేశం జరగడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశాంతంగా వున్న మండలంలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా సభలు నిర్వహించడం సరికాదన్నారు. సంక్షేమ పథకాల అమలులో అధికారులు కనీస సమాచారం కూడా ప్రజాప్రతినిధులకు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. అంతేగాక గోకులాల నిర్మాణం, ఉపాధి హామీ బిల్లుల చెల్లింపుల్లో ఓ వర్గానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కనీసం జాబ్ కార్డుల మంజూరులోనూ అలసత్వం ప్రదర్శించడంపై వైస్ ఎంపీపీ మండిపడ్డారు. మరోవైపు శెట్టివారిపల్లె, చక్కవాండ్లపల్లె, పక్కీరారెడ్డిగారిపల్లె అంగన్వాడీ సెంటర్లలో పిల్లలను చేర్చుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గాలివీడు-2 సచివాలయం పరిధిలో టైలరింగ్ శిక్షణా కేంద్రం ఏర్పాటు చేస్తే సర్పంచ్‌గా ఉన్న తనకు సమాచారం ఇవ్వకుండా ప్రారంభించడంపై సర్పంచ్ లక్ష్మీదేవమ్మ అధికారులను ప్రశ్నించారు. అంతేగాక మండలకేంద్రం బస్టాండ్ సమీపంలో దిబ్బలబడి వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎలాంటి ఎస్టిమేషన్‌లు లేకుండా వంద మీటర్ల దూరంలోకి ఎలా మారుస్తారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, వెంకట్రెడ్డి, తహసీల్దార్ భాగ్యలత, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశం సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలను సిబ్బందికి తెలియజేస్తున్న సీఐ కొండారెడ్డి

పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలు

సుండుపల్లె : పోస్టాఫీస్‌లో అందుబాటులోకి వచ్చిన ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సుండుపల్లె పోస్ట్ మాస్టర్ సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా పోస్ట్ ఆఫీస్‌లో ఆధార్ సేవలు నిలిపివేశారని, ప్రస్తుతం మళ్లీ ఆధార్ సేవలను పునరుద్ధరించినట్లు ఆయన తెలియజేశారు. మండల ప్రజలందరూ ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

సైబర్ నేరగాళ్లపై అవగాహన కల్పించండి


సచివాలయ పోలీస్ సిబ్బందికి సైబర్ నేరగాళ్లపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రవి ప్రకాష్ రెడ్డి

పెనగలూరు : సైబర్ నేరగాళ్లపై గ్రామీణ ప్రాంతాలలో అవగాహన కల్పించాలని ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సచివాలయాలలోని పోలీస్ సిబ్బందికి పోలీస్ స్టేషన్‌లో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సెల్‌ఫోన్‌ల ద్వారా సైబర్ నేరగాళ్లు అధికమయ్యాయని, ఎవరైనా తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే ఆ ఫోన్ ఎత్తకుండా ముందుగానే అవగాహన కలిగి ఉండాలని, అలాగే సెలవులు కావడంతో ఈతకు పిల్లలను వెళ్లకుండా తల్లిదండ్రులతో కలిసి ఉండేలా గ్రామాలలో తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

మదనపల్లె : కోడిపందెం ఆడుతున్న ఏడుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. మండలంలోని కోళ్లబైలు పంచాయతీ మాదినిగుంటకనుమ ప్రాంతంలో కోడిపందెం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడిచేశామన్నారు. దాడిలో పెద్దమండ్యం మండలం వెంగంవారిపల్లెకు చెందిన సదాశివనాయుడు(46), మదనపల్లె రామిరెడ్డి లేఅవుట్‌కు చెందిన జి.రెడ్డెప్ప(47), సి.రామాంజులు(42), ఎన్.రమణ(45), మిట్టామర్రివాండ్లపల్లెకు చెందిన గంగరాజు(34), రామారావు కాలనీకి చెందిన వెంకటప్పనాయుడు(36), రెడ్డీస్‌కాలనీకి చెందిన సుధాకర్(40)లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.5,400 నగదు, రెండు కోళ్లు, ఐదు మోటార్‌సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని తెలియజేశారు.

నేటితో ముగియనున్న మహాభారత యజ్ఞం


హరికథ చెబుతున్న సీతామహాలక్ష్మి

వీరబల్లి : మండలంలోని మట్లి పంచాయతీలో కోదండరామస్వామి దేవాలయం వద్ద ఈ నెల 18వ తేదీ నుంచి జరుగుతున్న మహాభారత యజ్ఞం బుధవారంతో ముగుస్తున్నట్లు కార్యనిర్వాహకులు తెలిపారు. పన్నెండు రోజులు నుంచి జరిగిన ఈ మహాభారత యజ్ఞం ఘనంగా జరుగుతుండటం సంతోషంగా ఉందని కమిటీ సభ్యులు చెప్పారు. ప్రతిరోజూ కోదండరామస్వామికి పూజలు చేయడమే కాక మండలంలోని చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు విరివిగా పాల్గొని హరికథను వింటున్నారు. మంగళవారం కురుక్షేత్రంలో పద్మవ్యూహంలోకి వెళ్లిన అభిమన్యుని సంహార కథను భాగవతారిణి సీతామహాలక్ష్మి వివరించారు. రాయచోటిరూరల్ సీఐ వరప్రసాద్ ఆధ్వర్యంలో రోజూ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణా శిబిరాలు



రాయచోటి అర్బన్: శిబిరంలో తయారు చేసిన ఆకృతులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు


వీరబల్లి: పిల్లలకు బోధిస్తున్న రిటైర్డ్ టీచర్ శ్రీనివాసులు


సిద్దవటం: గ్రంథాలయంలో విద్యార్థుల పుస్తక పఠనం

సిద్దవటం : విద్యార్థులు పుస్తకాలను చదవితే పూర్తిగా విజ్ఞానం సొంతమవుతుందని గ్రంథాలయాధికారిణి లక్ష్మీనారాయణమ్మ తెలిపారు. మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు పుస్తక పఠనం చేయించి నీతి పద్యాలు చెప్పించడం జరిగిందన్నారు. డ్రాయింగ్, ఆటల పోటీలు వంటి కార్యక్రమాలను నిర్వహించామన్నారు. అనంతరం పిల్లలతో క్యారంబోర్డు, చెస్ ఆటలను ఆడించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో 19 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

వీరబల్లి : మండల కేంద్రంలో ఉన్న గ్రంథాలయంలో ఏప్రిల్ 28వ తేదీ నుంచి జూన్ 6 వరకు వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తున్నట్లు లైబ్రరీ అధికారిణి విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. పిల్లలకు కావాల్సిన కథల పుస్తకాలు చదివించడం, ఆటలు, పాటలు, సృజనాత్మక కథలు లాంటి కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ముఖ్యంగా మండల కేంద్రంలో ఉన్న ఉత్తమ ఉపాధ్యాయులు, రిటైర్డ్ టీచర్ శ్రీనివాసులు ద్వారా పిల్లలకు విజ్ఞాన శిబిరంలో కావాల్సిన కథలు, సృజనాత్మక కథలు వంటి విషయాలు తెలియజేయనున్నట్లు చెప్పారు.

రాయచోటి అర్బన్ : వేసవి శిక్షణా తరగతులతో విద్యార్థులలో సృజనాత్మకత పెంపొందుతుందని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని విజ్ఞాన్ స్కూల్‌లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ 2వ రోజైన మంగళవారం కొనసాగింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజశేఖర్, శివ, జనవిజ్ఞాన వేదిక నేత బయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కార్డెన్ సెర్చ్


గ్రామస్తులకు సూచనలు చేస్తున్న సీఐ రాజ

రాజంపేట : రాజంపేట పట్టణంలో సీఐ రాజ ఆధ్వర్యంలో మంగళవారం ముమ్మరంగా కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఇళ్లల్లో తనిఖీలు చేపట్టారు. అలాగే వాహనాలను తనిఖీ చేసి వాటి రికార్డులను పరిశీలించారు. అలాగే గ్రామంలో ఎవరైనా అక్రమంగా నివసిస్తున్నారా అనే విషయాలపై ఆరా తీశారు. అనంతరం గ్రామస్తులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. తదుపరి సీఐ మాట్లాడుతూ సెల్‌ఫోన్ ఎంతవరకు అవసరమో అంతవరకే వినియోగించాలని, అనవసరమైన మేసేజ్‌లు పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.